# సమాంతరాలు

విహారి & శాలివాహన



'ఉద్యోగం పురుషలక్షణమే నేమో గాని రాధా, నాకుమాత్రం అది మహా బాధాకరంగా వుంది నిజం చెప్పాలంటే రిజైన్ చెయ్యాలనిపిస్తోంది కూడా''

'బాబ్బాబు, అంతపని మాత్రం చెయ్యకండి. పెళ్ళయి ఆర్నెల్లైందో లేదో, మా అబ్బాయికి ఉన్న ఉద్యోగం కాస్త ఊడింది' అని మీ అమ్మగారు సాధింపు మొదలెడతారు పనిబడా ఈ వూరొచ్చి'

'సాధించేది నిన్నేగా. నాకేం. ఒకవేళ వాళ్ళ ఏదైనా నష్టం కలిగినా సహిస్తాను గాని గొంతుకు వురేసినట్లుగా ఊపిరాడనివ్వని ఈ వుద్యోగాన్ని మాత్రం నేను చేయలేను అసలు ఉద్యోగమంటే ఏమిటో తెలుసా?'

'ప్చ్' తెలీదన్నట్లు అమాయకంగా తల ఆడించింది రాధ.

'నీ కెలా తెలుస్తుంది నీకు తెలీదు. నే చెప్తా విను. మనిషిలోని ఉత్సాహాన్నీ, కోరికల్నీ అణచివేసే ఉక్కు యంత్రం. అందాన్ని ఆస్వాదించటానికీ ఆనందాన్ని అనుభవించటానికీ గల ఒకటి అరా అవకాశాల్ని అమాంతం కాలదన్నుకపోయే డేగలాంటిది ఈ ఉద్యోగం. గనుక నేచెప్పొచ్చేదేమంటే...'

'సార్, సార్! చిన్న డవుట్. అంత ఉపద్రవాన్ని మీ మంచి ఉద్యోగం ఇప్పుడేం తెచ్చిపెట్టిందని?'

'అలా అడిగేవు బాగుంది. అందుకు సజావైన సమాధానం సిద్ధంగా వుంది చెప్తాను విను.' కృష్ణ ఒకసారి స్టైల్నీ, గొంతునీ సవరించుకుని మళ్లీ చెప్పడం మొదలెట్టేడు. 'ఈ వుద్యోగం వల్లనే కదూ, ఇప్పుడీ ముగ్ధ మోహన సౌందర్యరాశిని వంటరిగా వదలి వెళ్ళవలసిన అవసరం ఏర్పడింది? ఏవేవో రహస్యాల్ని తెలుపుతూ తీయని మధురానుభూతుల్ని జ్ఞప్తికి తెచ్చి మనసును పారవశ్యంలో ముంచే ఈ నయనద్వయాన్ని విడిచి వెళ్ళవలసిరావడం ఈ యొక్క ఉద్యోగం మూలంగానే కదూ? తుచ్ఛమైన ఈ ఉద్యోగంకంటే కోటిరెట్లు విన్నయైన, మధురానందదాయకమైన మరో వుద్యోగం నాకుంది. నా మానాన నన్నొదిలి పెట్టండి, అంటే వినేవాళ్ళే లేనారోయె గద! హా దైవమా!!'

'కటకటా ఎన్ని ఇక్కట్లువచ్చె! ఇంతకీ ఆ దరు మధురానందదాయకమైన ఉద్యోగ మేమిటో!'

'అది చాల అందమైన ఉద్యోగం. ఆనంద దాయకమైంది కూడా ... చెంతనున్న చెలి శిరమును ఈ విశాలమైన ఛాతీలో ఇలా దాచుకుని మృదువైన కపోలాల్ని ఇలా స్పృశిస్తూ, అరమోడ్పులైన ఆ చక్కని కళ్ళమీద.....'

'పోస్ట్'

'జస్టె మినిట్ ప్లీజ్!'

బయట పిలుపు విని రాధ గబగబా కృష్ణ చేతుల్ని విడదీసుకుని వరండాలోకి పరుగెత్తింది.

అర్ధాంతరంగా వచ్చిపడిన ఆ పోస్టు బంట్రోతుని, ఆ బంట్రోతుని అలా రప్పించిన ఈ కథకుల్ని తిట్టుకున్నాడో ఏమో గాని, రాధ తెచ్చియిచ్చిన కవరును చూసిం తర్వాతమాత్రం కృష్ణ మొహం సంతోషంతో ట్యూబ్ లైటులా వెలిగింది.

'ఎక్కడ్నుంచీ, ఉత్తరం?' రాధ ఉత్సుకతను ఆపుకోలేక పోయింది.

'వాడు లేడూ, నా పెన్ ఫ్రెండ్ అనబడే రవి, వాడిదగ్గర్నుంచి. ఆరే, ఏవిటి అలా అయిపోతున్నావ్, కేవలం, పెన్ ఫ్రెండ్ ని 'వాడు' అంటున్నాననేనా? మై డియర్ ఇన్నొసెంట్ రాధా! ఇంతమాత్రానికే ఆశ్చర్యపడట మెందుకు? చూడు, మనసులు కలిసినప్పుడు అంటే ఒకరిభావాలు మరొకరికి నచ్చినపుడు, ఒకరి అభిరుచులు మరొకరికి నగటుకలిగించనపుడు — వారిద్దరి మధ్యా వుండే దూరం దూరంకాదు. అడ్డుగోడలు కుప్పగా కూలిపోతాయి. చూపుల్లో మాటల్లో, చేతల్లో వారిద్దరికీ సాన్నిహిత్యమేగాని దూరం వుండదు. ఆ స్థితి వచ్చినపుడు సంబోధనలోని ఈ ఉచ్ఛ్వ నీచాలు పారిసంటవు. ఎందుకీ ఆశ్చర్యం? నా మాటల్లో కవిత్వం, వేదాంతం కలిసి వున్నందుకేనా?'

ఎరువు తెచ్చుకున్నట్టున్న నవ్వుని చిరునవ్వును రంగు పులిమినట్లు పెదాలమీద పులుముకుని ఆ రంగు చిరునవ్వునే సమాధానంగా భావించుకోమని, భావగర్భితంగా వుంటూనే పైకి తెగనవ్వుతున్నాడే కృష్ణ వైపు, అతని ముందున్న టీపాయిమీది పింకకవరువైపు మార్చిమార్చి చూడసాగింది రాధ.

రాధ కళ్లలోకి ఒకసారి సూటిగాచూసి తిరిగి చెప్పడం మొదలెట్టాడు కృష్ణ. 'నాకీ కవితాధోరణి ఈ రవిగాడి ఉత్తరాలు చదవడం వల్లనే అలవాటైంది రాధా! అన్నట్లు నీకొకవిషయం చెప్పానా రాధా? రవి స్టేట్సుకు వెళ్లింతర్వాత బాగా మారిపోయాట్ట. ఇక్కడున్నప్పుడు ఆవేశం, కోపం, అహంభావం మూర్తీభవించినట్లు ఉండేవాడుట. ఇప్పుడెంతో నిదానాన్ని అలవరచుకుని, మానసికావస్థల నన్నిటినీ ఒకే విధమైన నిగ్రహంతో అనుభవించటం నేర్చుకున్నాడట. అలాంటి మార్పును పొందటం చాలా గొప్పవిషయంకదూ రాధా? పైగా మన భారతీయ సిద్ధాంతాల గొప్పదనాన్ని చాటుతూ కథలూ, కవితా ఖండాలూ వ్రాసేస్తున్నాడుట త్వరలో ఇక్కడికి వచ్చినపుడు మనకి చూపిస్తానన్నాడు వాటిని.'

'ఇక్కడికి వస్తాడా' రాధ ఆశ్చర్యంగా చూస్తూ అడిగింది.

'అవును రాధా. ఒకనెలరోజుల్లో రావచ్చునని రాశాడు. కావాలంటే ఇదుగో ఈ వుత్తరం చదువు.'

కృష్ణ కవరును రాధకిచ్చి టైం చూసుకున్నాడు.

'ఓ, మై గాడ్. చూశావా ఎలా పరుగెత్తుతోందో కాలం కాలానుగుణ్యమైన ఈ వుద్యోగం వెనకాల పరుగెత్తటం నాకు తప్పదు కాబోలు రాధా! అంతేగాదు ఆ పరుగెత్తడంలో ఎక్కడా కాలుజారకుండా పొరపాట్లు దొర్లకుండా 'యస్సార్'ను కాపాడుకోవాలి. ఖర్మ. వస్తా. బై. బై.'

వెళ్తున్న కృష్ణవైపే చూస్తూ నిల్చున్న రాధ కొంతసేపటికి తేరుకుని, వీధివాకిలి గడియవేసివచ్చి కుర్చీలో కూర్చుంది. మనస్సు మంచుముద్దలా అయిపోయినట్లనిపించిందామెకు. కృష్ణ మాట్లాడే నిష్కల్మషమైన మాటలతీరూ, ఆ మాటల్లోని విషయాలూ, అరమరికల్లేకుండా తనను దగ్గరకు తీసుకుని లాలనగా, ఆప్యాయంగా ప్రేమగా స్పృశించి, తామిద్దరూ ఒకరిలో ఒకరు లీనమైపోవాలని చేసే కృష్ణ చేతలు జ్ఞప్తికి వచ్చినప్పుడల్లా మంచుకరిగి ద్రవిస్తున్నట్లుగా కన్నీరు కారుతుంది ఆమె గుండ్రని కండ్లనుంచి. దుఃఖం పెల్లుబుకుతుంది. ఎందుకు? తను కృష్ణను మోసం చేస్తున్నదనా? తనేం చేయకూడని పనులేవీ చేయలేదు. మనసుకు నచ్చిన మధురమైన భావాల్ని, ఆ భావాల్ని కలిగించిన ఒకటిరెండు సంఘటనల్ని హృదయపు లోపలి పొరల్లో నిక్షిప్తం చేసుకుంది. అలా దాచుకోటం నేరమా? పోనీ అలా దాచుకోకుండా వాటిని బహిర్గతం చేస్తే? ఎవరికి? ఇంకెవరికీ, కృష్ణకే చేయాలి. చేస్తే, ఆ భావాల తీవ్రతకు, సంఘటనల తాకిడికీ కృష్ణ నిలవగలడా? తనను నిలవనిస్తాడా?

ఏమో. హృదయ వైశాల్యమున్న కృష్ణ, తన మనసును అర్థం చేసుకోలేడా? 'పిచ్చి రాధా. ఇంత తేలిక విషయాలు నాతో చెప్పాల్నా? నన్ను నీవు అర్థంచేసుకున్నదింతేనా? అనవసరమైన ఆలోచనల్ని పెంచుకుని బాధపడకు.' అని భరోసా ఇవ్వకూడదూ?

కాని, తీరా చెప్పింతర్వాత తనుకొంతే చెప్పాననీ, చెప్పనిదే ఎక్కువవుండి వుంటుందనీ అనుమానించి మనసును కలవరపరచుకుంటే కలిగే పరిణామాలు ఎంత తీవ్రంగా వుంటాయి! సుఖంగా ఆనంద డోలికలతో తూగుతున్న సంసారంలో ప్రచండ ఝంఝామారుతం వీయదూ? తలచుకుంటేనే శరీరం చల్లబడి భయం ముంచుకొస్తోందే.

శారద ఏంచేసింది? గతాన్ని మర్చిపోయింది. అంతేగాదు, భవిష్యత్తులో కావలసిన సుఖశాంతులనే సుమసౌరభాల కోసం వర్తమానపు నందనోద్యానవనాన్ని పెంచిపెద్దది చేసుకుంటోంది

కాని, కృష్ణతరహా వేరు మనిషి మనసుకూ, శరీరానికి గల సంబంధాన్ని వివరిస్తూ కృష్ణ అనేమాటలివి: 'మనసులో వున్నదేదో పైకి చెప్పుకోవాలి. చెప్పుకోలేనపుడు ఏదో విధంగా దాన్ని ఇతరులు కూడా తెలుసుకునేలా చేయాలి అలా ఏమీ చేయలేనప్పుడు మనసు మనల్ని తినేయకమానదు. మనిషికివచ్చే చాలా రుగ్మతలకి మనసే కారణమనే దాంట్లో అతిశయోక్తి లేదంటాను.'

అనటమేకాదు, ఆచరణలోకూడా చేసిచూపెడతాడు కృష్ణ ఆ రాత్రి......

ఈ రాధకు మరచిపోలేని రాత్రి. కృష్ణ ఈ రాధను తనస్వంతం చేసుకున్న నాటి రాత్రి. పందిరిమంచం చుట్టూ దోమతెర అక్కరలేకుండా అమర్చిన మల్లెపూలదండల్ని చూసి, గుబాళింపుల్ని మనసునిండా నింపుకుంటూ నిల్చుంటే 'రాధా' అంటూ మెల్లగా, తియ్యగా పిల్చారు అదే తొలిపలుకు. ఆ తర్వాత ఒక కావ్యానికి సరిపడా మాట్లాడుకున్నారు తామిద్దరూ. ఆ కావ్యంలో తన 'ఊఁ' లే ఎక్కువ.

ఆ రోజు కృష్ణ మాట్లాడిన ప్రతిమాటా తనకిప్పటికీ బాగా జ్ఞాపకం. మరచిపోలేనంతగా హృదయానికి హత్తుకున్న మాటలవి. ఆ మాటల్నీ కొన్నిటిని పొందుపరుస్తూ శారదకు ఉత్తరం రాసింది......

రాధ గబగబాలేచి బీరువాలోని చీరమడతల్లో దాచిన ఒక కవరును బయటకు తీసింది. అందులో రెండు ఉత్తరాలున్నై. ఒకదాని తర్వాత ఒకటిగా వాటిని ఇలా చదువుకుంది రాధ.

'శారదా!' మనం అప్పుడప్పుడూ అనుకునే వాళ్లం గుర్తుందా, అనుకున్నది అనుకున్నట్లుగా చేసేయడానికి అవసరమైన ధైర్యసాహసాలుండటం ఒక వరంలాంటిదని? నాకలాంటి ధైర్యం లేకపోవడం నాకో శాపంలానే పరిణమించింది. ఏ విషయంలోనూ చొరవగా తలదూర్చే తత్వంకాదు నాది. అలా తలదూర్చడమంటూ జరిగేక ఆ విషయాన్ని అంతసులభంగా మరచిపోనూ లేను మనం కాలేజీలో చదివే రోజుల్లో నాకంటే నువ్వే ఎక్కువమందితో కలిసి తిరుగుతూ చలాకీగా మాట్లాడుతూ, నీ స్నేహాన్ని కాంక్షించి నీ చుట్టూ తిరిగే విద్యార్థుల్ని ముఖ్యంగా రవిని చిలిపిగా ఆటలు పట్టిస్తుండే దానివి. నన్నూ నీలానే సరదాగా వుండమని ప్రోత్సహించే దానివి. అప్పుడే నేను రవితో స్నేహాన్ని పెంచుకున్నాను. అతనిలోని ఆవేశం, కోపం వీటికి కారణభూతమైన అతని అమాయకత్వం నన్ను ఆకర్షించాయి. అతనూ నాతోటి సరదాగా కబుర్లు చెప్తూ నాకు దగ్గరైనాడు. ఇంతలోనే పరీక్ష అయిపోవడం అందరి

# సమానాంతరాలు

వాళ్ళు వేరు కావడం జరిగింది.

'ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే అప్పట్లో రవీ, నేనూ వివాహం చేసుకుందా మనుకున్నాం. శెలవుల్లో మా వాళ్ళకి విషయాన్నిచెప్పి ఒప్పించాలనుకున్నాను. అనుకున్నానేగాని అనుకున్నంత తేలిగ్గా చెప్పలేకపోయాను. ఈలోగానే మావాళ్ళు నాకు 'ఈయన'తో వివాహాన్ని నిశ్చయించారు. అప్పుడు నేను బయట పడటమేగాని నా మనసులోని విషయం చెప్పికూడా ప్రయోజనముండదని నా కనిపించింది. నా ప్రయత్నాన్ని మానుకున్నాను.

'మావారు చాలా మంచివారనీ, నన్నెంతో ప్రేమతో చూస్తారనీ, ఉద్యోగంకూడా మానేసి ఎప్పుడూ నాతోనే సరదాగా కాలక్షేపంచేస్తూ కూర్చోవాలని అంటారనీ రాస్తే నీవు నమ్మలేవేమోగాని, అందులో పిసమెత్తుకూడా అతిశయోక్తి లేదు ఆయన మనసు అంతమంచిది. (నేనింతగా పొగిడేస్తున్న మావార్ని చూడాలనివుందికదూ నీకు? అందుకే నా పెళ్ళినాటి ఫోటో ఒకటి పంపుతున్నాను.) అలాంటి మంచి మనిషికి నా మనసును విప్పిచెప్పలేని నా బలహీనత నన్ను కృంగదీస్తోంది. ఆయనలా చెప్తారు. నన్ను చెప్పమంటారు. ఒకరోజు ఏమన్నారో తెలుసా?

'రాధా! ప్రతివ్యక్తికీ కాస్తోకూస్తో గతం వుంటుందంటారు. అది ఎంతవరకు నిజమేగాని, నా జీవిత భాగస్వామివైన నీకు తెలియజేయాల్సిన నా గతం కొంచెంవుంది చెప్పనా? విశాఖపట్నంలో ఆనర్సు చదివేటప్పుడు నా క్లాస్‌మేట్ ఒక అమ్మాయి వుండేది. మామూలు అమ్మాయికాదు. చాకులాంటి అమ్మాయి. ఛాంకీ అమ్మాయి. నా కెప్పుడూ ఆ అమ్మాయి చెప్పే తీయని కబుర్లు వినాలనివుండేది. మేమెంతగా కలిసి మెలిసి తిరిగేవాళ్ళమంటే అందరూ మేమిద్దరం ప్రేమించుకున్నామని భావించేవాళ్ళు, కాని నాకు తెలిసినంతవరకూ అలాంటిదేమీలేదు. కాని ఓ చిన్నసంఘటన మాత్రం చెప్పుకోవాలి ఓరోజు మేమిద్దరం బీచికివెళ్ళాం. పైన పండువెన్నెల, ప్రక్కనే ఉవ్వెత్తు అలలతో సముద్రం, చుట్టూ మమ్మల్ని చుట్టుముట్టిన చల్లనిగాలీ మనసుకు ఆహ్లాదాన్ని కలిగిస్తుంటే 'ఇలాంటి వాతావరణంలో నీకేంచేయాలని వుంది' అని ఆ అమ్మాయిని ప్రశ్నించాను, కాశీమజిలీ కథల్లోలా. జవాబు చెప్పకుండానే అదే ప్రశ్న నన్నడిగింది. నేనేమన్నానో చెప్పనా? 'అందమైన నీలాంటి యువతిని నా బాహువుల్లో బంధించాలనివుంది' అన్నాను. ఆ మాట అన్నానో లేదో, 'పొద్దుపోయింది పోదాం పదండి' అంటూ లేచింది. లోలోపల నవ్వుకుంటూ నేనూ లేచాను. ఇద్దరం నడుస్తున్నాం. నేను టక్కున ఆగిపోయి 'పాము, పాము' అని అరిచాను. పాపం ఆ అమ్మాయి ఖంగారు పడిపోయి నా పైకి వొరిగిపోయింది. అక్కడ నిజానికి పామూ లేదు, ఏమీలేదని తెలుసుకున్న తర్వాత 'మీ కోరిక నెరవేర్చుకున్నారన్నమాట' అంది మెల్లిగా. ఆ అమ్మాయిపేరు చెప్పనా.'

'వొద్దువొద్ద'ని నేనాయన్ని వారించాను. నేను వినదలచుకోలేదు నా వ్యక్తిగత విషయాలు అతనికి చెప్పేధైర్యం నాకు లేనప్పుడు అతని వ్యక్తిగత విషయాలు నేనెందుకు వినాలి? తనను గురించి ఆయన అలా చెప్పుకున్నప్పుడల్లా నాకు రవి గుర్తుకొస్తాడు. రవీ నేనూ చేసుకున్న బాసలు, కట్టుకున్న ఆశాహర్మ్యాలూ జ్ఞాపకం వస్తాయి. రవిని గురించి ఆయనకు చెప్పడమా మానడమా అని మథనపడతాను. చెప్తే రాగల ప్రమాదాల దృష్ట్యా చెప్పకుండా వున్నందువల్ల పొందలేని లాభాల్ని వదులుకోడమే మంచిదేమోననిపిస్తుంది. నీ సలహా ఏమిటో చెప్తావా శారదా!

నీ


రాధ.'

గట్టిగా నిట్టూరుస్తూ రెండో ఉత్తరాన్ని విప్పింది' రాధ.

'రాధా!

నీ ఉత్తరంతోబాటు వచ్చిన నీ పెళ్ళినాటి ఫోటో నీ వుత్తరం చెప్పలేని విషయాలెన్నిటినో చెప్పింది చెప్పి, మర్చిపోయిన నా గతాన్ని మళ్ళీ నాకు జ్ఞప్తివి తెచ్చింది. మనిద్దరం స్నేహితులమైనందుకు మన జీవితాలు కూడా కొంతవరకు ఒకేవిధంగా సాగుతున్నై.

నా చదువు ముగిసే రోజుల్లో నేనూ నీలానే ఒకతన్ని ప్రేమించాను. కాని నా ప్రేమ 'వన్ వే ట్రాఫిక్' అని, అతను కేవలం వినోద వస్తువుగానే నన్ను చూస్తున్నాడనీ అప్పట్లో నాకు తెలీలేదు. అయిందేదో అయిపోయింది. నేనిప్పుడు సుఖంగానే కాపురం చేస్తున్నాననుకుంటున్నాను. గనుక గతాన్ని గురించి విచారించను. అంతా మరచిపోయాను. మరచిపోయినవాటిని మళ్ళీ జ్ఞప్తికి తెచ్చిన మీ పెళ్ళినాటి ఫోటోను త్రిప్పి పంపుతున్నాను, మరోసారి నా గతం నన్ను వెక్కిరించకుండా.



ఆరోగ్య అనారోగ్య
పరిస్థితులలో మహిళలు
ఆరోగ్య
సౌభాగ్యములకు
ఆధారపడునది
లోధ్ర
60 సంవత్సరముల పైగా
ప్రసిద్ధినొందినది


కేసరి కుటీరం
(ప్రైవేట్) లిమిటెడ్
రాయపేట, మద్రాసు-14
ఏజెంట్లు:
సీతారామ జనరల్ స్టోర్సు (ఏజన్సీస్)
విజయవాడ. సికింద్రాబాదు. మధుర.
బరంపురం. బెంగుళూరు

టెరిలిన్ వస్త్రములు

టెరిలిన్ పాంటు మరియు
షర్టు వస్త్రములు
(1.25 & 2.25 మీ.)
రెండున్ను కలియు రెన్ను
ధర రు. 28.50 లకే
అమ్మబడును. V.P.P.
ఛార్జీలు రు.2.50అదనం
ARVIND AGENCIES (APW-40),
P. O. Box 1408, Delhi-6.

తెల్లవెంట్రుక లుండవు
పొగడడం మాకు ఇష్టం లేదు. కాని "మా కేష్ రంజన్" ఆయుర్వేదిక్ సెంటెడ్ ఆయిల్ తెల్ల వెంట్రుకలను నల్లగామార్చును. మొదట, తెల్ల వెంట్రుకలునల్లగామార్చి, ఆటుపైన నల్లని వెంట్రుకలే వచ్చును. ఈ ఆయిల్ జ్ఞాపకశక్తి, కంటిచూపువృద్ధిపరుచును. లాభంపొందినవారు 1000 పైగా మాకు వ్రాసియున్నారు. లాభం లేకున్న డబ్బు వాపసు. ధర రు. 10/-
Bengal Ayurved Bhawan (55)
P. O. Katri Sarai, (Gaya)

# సమానాంతరాలు

ఉత్తరం ముగించేముందు మరొక్క మాట చెప్పాలని వుంది. మీ వారు చెప్తున్నా నీవు చెప్పనీయని ఆ అమ్మాయిపేరు... శారద. ఈ విషయాల్ని గురించి ఇకనేమీ వుత్తరాలు రాయవద్దని నా రిక్వెస్టు. అందుకే నీ వుత్తరాన్ని కూడా నీకే పంపుతున్నాను. నీకు నా సలహా ఏమిటో ఈ పాటికి అర్థం చేసుకునే వుంటావు, శలవు—శారద.'

* * *

'రాధా! రాధా!! ఈ డేంఫూల్‌గాడు ఏం చేశాడో చూశావా'

'ఎవరు?'

'వీడే. ఈ రవిగాడు. వెలరోజుల్లో వస్తున్నానని రాశాడు గదూ! ఆ వెధవ వాలుగుచేత భాగారించి వారంరోజుల్లోనే తయారౌతున్నాడు. మధ్యాహ్నం రైల్లో ఇక్కడికొస్తున్నాట్ట.'

రాధ గుండె ఒక్కసారి ఆగి, మళ్లీ పని చేయడం మొదలెట్టింది. నుదుట ఏర్పడిన చమటను తుడుచుకుంటూ 'అలాగా' అంది.

'అలాగా' అని అంత తేలిగ్గా అన్నావు గాని నాకో పెద్ద సమస్య ఎదురైంది.'

కృష్ణ ఏం చెప్తాడోనని రాధ భయపడిపోయింది. రవి వస్తే అతనితో తను ఎలా మాట్లాడాలో ఏమని మాట్లాడాలో ఆలోచిస్తూ వుండిపోయింది.

'మాట్లాడవేం రాధా, ఏం చేద్దామంటావ్' కృష్ణ రెట్టించాడు.

'ఏ విషయం?'

'మైగాడ్ అలా అడుగుతావేం రాధా. రవి. రవి వస్తున్నాడు. వాణ్ని రిసీవ్ చేసేదెలా?'

'ఏం?'

'నేను ఆఫీసులో వుంటాను. శలవు పెట్టడానికి కూడా వీలులేకుండావుంది.'

'అడ్రసు తెలుసుగా. వేరుగా ఇంటికి వస్తారు'

'నో. నో. రాధా. బావుండదు. స్టేషనుకువెళ్లి అతన్ని రిసీవ్ చేయకపోతే అతను బాధపడిపోతాడు. అతని సంగతి నీకు తెలీదు. చాలా సెన్సిటివ్'

'అయితే ఏం చేద్దామంటారూ?' విసుగ్గా అడిగింది రాధ.

'అదే తోచకుండా వుంది. నువ్వు డూ ఒక పనిచేస్తేనో?'

'అలాగే చేసేయండి.'

'నేను కాదు. నీవు'

'ఏమిటి?'

'నీవు వెళ్లి రవిని రిసీవ్ చేయి.'

'నేనా. అబ్సర్డ్. నో. నేవెళ్లలేను. వెళ్లను.'

'అలా అనకు రాధా. ప్లీజ్. ఇందులో తప్పేముంది? చదువుకున్నదానివి, సొసైటీలో మువ్ అవుతున్నదానివి. నీ ఫ్రెండ్, ఐమీన్ నా ఫ్రెండ్‌ను అత్యవసర పరిస్థితుల్లో రిసీవ్ చేయడంలో తప్పేముంది. ప్లీజ్ డోన్ట్ బి టిమిడ్.'

రాధకు ఏడ్పొచ్చినంత పనైంది. గుండెల్లో దడదడమని వినిపిస్తోంది. కాళ్లు వణుకుతున్నై. సంభవించకూడదనుకున్న సన్నివేశం సంభవించి ఎదుర్కోగూడదనుకున్న సంఘటనను ఎదుర్కోవలసివచ్చినందుకు కుమిలి పోయింది. మళ్లీ ఆ కుమిలింపు భర్త చూడగూడదు. అదీ తనస్థితి. నిస్సహాయంగా చూసింది కృష్ణవైపు.

'థాంక్యూ వెరీమచ్ డియర్. వెరీగుడ్ గర్ల్. నే వెళ్తున్నాను. ఆఫ్‌కోర్స్ మూడింటికి స్టేషనుకి రావడానికి ప్రయత్నిస్తాను...అరె...నీ వెంత తెలివితక్కువదానివి రాధా.'

ఆశ్చర్యంగా, భయంగా కృష్ణవైపు చూసింది రాధ.

'రవి నీకు తెలుసా'

రాధ నిర్ఘాంతపోయింది. 'నాకా'

'మరి, రవి నెలా గుర్తుపడదామనుకున్నావ్? ఊఁ, ఉండు, ఫోటో చూద్దువుగాని ఒకసారి.' కృష్ణ లోపలికి వెళ్లాడు.

కృష్ణ మాటలకు రాధ బాగా భయపడిపోయింది. రవితో తనకున్న స్నేహాన్ని పసిగట్టాడా అని అనుమానించింది.

కృష్ణ బయటికివచ్చి 'ఇదేనేవ్వో చూడు అతని ఫోటో. ఆయామ్‌సారీ. నిన్నుడుగుతావేంటి. ఇదే అతని ఫోటో నే వెళ్తున్నాను. బై.'

చేతులోని ఫోటో వైపొకసారి చూసి, దాన్ని టేబులుమీదకు విసిరి, రెండు చేతుల్లోనూ మొహాన్ని దాచుకుంది రాధ.

* * *

మూడు కావస్తోంది మధ్యాహ్నం. ఎండ తీవ్రత భరించరానిదిగావుంది. గాలి కూడా ఎండ పక్షమేనన్నట్లు తన వునికిని కూడా తెలియజేయడంలేదు. రాధ స్టేషను కొచ్చే దరికి రైలింకా రాలేదు. చాలా హుందాగా తయారై, బెరుకూ, సంకోచమూ ఏమీ లేకుండా ధైర్యంగా, ఠీవిగా నడుస్తూ వచ్చింది. తన రిస్ట్‌వాచీ వైపొకసారి చూసుకుని 'ఇంకా పదినిముషాలుందే' అను కుని విసుగ్గా అటూ ఇటూ తిరగసాగింది.

రైలువచ్చి ఆగింది. ఫస్ట్‌క్లాస్ కంపార్ట్ మెంట్ రాధ కెదురుగా ఆగింది. అందులో నుంచి దిగేడు రవి. ఎరుపూ, పసిమీ కలిసిన వింతరంగు శరీరం వల్చని గ్లాస్గో లాల్చీలోనుంచి కనుపిస్తోంది. చేతులో ఖరీదైన సిగరెట్.

'ఓ...రాధా...నువ్వేనా. వెరీ హేపీ టు సీ యూ. నువ్వూ ఈవూళ్ళోనే వుంటు న్నావా? నే వొస్తున్నానని నీకెలా తెలుసు?'

రాధ సన్నగా నవ్వి 'మా యింటికేగా మీరు రావడం' అంది.

'ఎస్. అంటే కృష్ణ నీ భర్తన్నమాట! యామై కరెక్ట్?'

'ఔ. నేను కృష్ణ భార్యను.'

రవి వొకసారి నొసలు చిట్లించి, రాధను వింతంగా చూశాడు. చివరికి నవ్వు తెప్పించు కుంటూ 'ఫన్నీగర్ల్' అన్నాడు. వెంటనే 'సారీ! సారీ?!' అని పిలిచాడు.

'సారీ ఎందుకు? అక్కర్లేదు...'

రవి అర్థంగానట్లుచూసి 'రాధా' అన్నాడు.

'నా పేరు రాధాదేవి...'

'అయామ్‌సారీ...కృష్ణ ఎక్కడ?'

'మీ రిక్కడకు ఎందుకు వచ్చినట్లు?'

'కృష్ణ నా ఫ్రెండ్- అఫ్ కోర్స్ ఇంత వరకూ పెన్ ఫ్రెండే. అతన్ని చూడాలని. అతనూ రమ్మన్నాడు. మీతో చెప్పలేదా?'

'అంతకంటే వేరేపని లేకుంటే మీరు మీ జర్నీని బ్రేక్ చేయకుండావుంటే ఎంతో సంతోషిస్తాను.'

'రాధా...దేవీ...మీరిలా ఎందుకు, ఎలా మాట్లాడుతున్నారో నాకర్థం కావడం లేదు. కృష్ణ వూళ్ళో లేడా?'

'వున్నారు. కాని ఈ డ్యూటీ నాకు పడింది. రైలు కదలబోతోంది ప్లీజ్...'

'నా విషాద కోపమా రాధా!'

'లేదు. గతాన్ని మర్చిపోవడం నేర్చుకుంటు న్నాను. గమ్యాలు వేరైన మనం కలుసు కోకుండా వుంటేనే బావుండేది. కాని... మళ్ళీ నా జీవితంలోకి తొంగిచూడవద్దని మిమ్మల్ని రిక్వెస్ట్ చెయ్యడం...సభ్యత కు వ్యతిరేకంగా తోస్తే క్షంతవ్యురాల్ని...'

రైలు వెళ్ళిపోతోంది. ఫస్ట్‌క్లాస్‌కంపార్ట్ మెంటులోని రవి దిగ్భ్రమ చెందినట్లు రాధవైపు చూస్తూనే వున్నాడు. అతనూ రైలూ కనుమరుగవుతుండగా...రాధ వెను దిరుగుతుండగా.

'రాధా వచ్చేశాను...ఇప్పుడే వచ్చేను. అరె! రైలు వెళ్ళిపోయిందా? రవి రాలేదా?' అంటూ రాధ భుజంమీద చెయివేశాడు కృష్ణ.

'వచ్చారు' అంది ముక్తసరిగా,

'మరి ఏరీ?'

'దిగలేదు'

'ఎందుకని?'

'అర్జంటు పనులున్నాయట వెళ్ళిపోతా అన్నారు. మిమ్మల్ని కలుసుకోలేనందుకు విచారాన్ని వ్యక్తం చేశారు'

'థేంక్స్ రాధా. నా కొచ్చిన ఒకేఒక్క అవకాశాన్ని వినియోగించుకోలేక పోయాను. వాడికి నేను చాలా చెప్పాలనుకున్నాను రాధా. వాడి వుత్తరాల్లో అన్ని సంగతులూ వుంటాయిగాని తనను గురించి ఎప్పుడూ వివరంగా రాయడు. నా కనిపిస్తుంది, మన సులో ఏదో మధన పడుతున్నాడని. నిజం రాధా, రవిని నేను బాగా అర్థం చేసు కున్నాను. అతన్ని గురించిన వివరాలన్నీ సేక రించాను. అందుకే అతనికి ప్లెయిన్‌గా చెప్దామనుకున్నాను. రవీ! నువ్వు నాకు చెప్ప కుండా దాచినా, నీ మనసులోని బాధ నాకు అర్థమైంది. నువ్వెవరిని ప్రేమించినా నీ ప్రేమ పవిత్రమైంది. స్వార్థంలేని ఆరాధన అది. అయినా అది గతం. దాన్ని గురించి ఇప్పుడు బాధపడటం మానేసి జీవితాన్ని ఆనంద మయం చేసుకోడానికి ప్రయత్నించు' అని. కాని నాకీ అవకాశం లేకుండా పోయింది. దట్సాల్‌రైట్. నా మనసులోది నీకు చెప్పేను. ఇక నాకు ఏ దిగులూ వుండదు. కమాన్. లెటజ్ గో.'

అతని మాటల్ని విన్న రాధ అతని కళ్ళ లోకి భయంగా, ఆశ్చర్యంగా దిగులుగా చూసింది. రిక్షా కుదుపులో అతనిమీదకు వొరిగిపడిన రాధను పొదివి పట్టుకున్నాడు కృష్ణ. ●

